# లియాన్ (శాప ప్రమాణం) ఆదేశాలు

**113**వ అంశం : భర్తకు తన భార్య వ్యభిచారానికి పాల్పడిందన్న గట్టి నమ్మకం కలిగినప్పుడు ఆమె నుండి విడిపోయే పద్ధతేమిటంటే, అతను షరీయత్ న్యాయస్థానానికి వెళ్ళి స్వయంగా సాక్ష్యమివ్వాలి: "నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి, ఈవిడ ఒక వ్యభిచారిణి అని సాక్ష్యమిస్తున్నాను" అని నాలుగుసార్లు పలకాలి. ఐదవసారి "నేను గాని అబద్ధం చెబితే నాపై అల్లాహ్ అభిశాపం పడుగాక!" అనాలి. ఒకవేళ ఆ స్త్రీ గనక తన నేరాన్ని ఒప్పుకుంటే షరీయత్ చట్టం ప్రకారం ఆమెకు శిలా శిక్ష విధించమని కోర్టు ఆదేశిస్తుంది. ఒకవేళ ఆ స్త్రీ ఈ ఆరోపణను నిరాకరించినట్లయితే "ఈ మగవాడు అబద్ధం చెబుతున్నాడని దైవసాక్షిగా చెబుతున్నాను" అని నాలుగుసార్లు చెప్పాలి. ఐదవసారి "ఈ మగవాడు గనక తన ఆరోపణలో సత్యవంతుడైనట్లయితే నాపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుగాక!" అనాలి. ఆ తరువాత వారిద్దరి మధ్య కోర్టు శాశ్వతంగా వేర్పాటు కల్పిస్తుంది. దీనినే షరీయతులో 'లియాన్' అంటారు.

"ఎవరయినా తమ భార్యలపై (అక్రమ సంబంధపు) నింద మోపి, దానికి స్వయంగా తాము తప్ప మరెవరూ సాక్షులు లేనిపక్షంలో వారిలో ప్రతి ఒక్కరూ నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, తాను చెప్పేది నిజం అని పలకాలి (అదే వారి సాక్ష్యం). అయిదవసారి- 'ఒకవేళ తాను చెప్పేది అబద్ధమైతే తనపై అల్లాహ్ శాపం పడుగాక!' అని చెప్పాలి. ఇక ఆ స్త్రీ శిక్ష నుంచి బయటపడే మార్గం ఏమిటంటే, ఆమె నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, 'తన భర్త చెప్పేది అబద్ధం' అని పలకాలి. (అన్ నూర్:6-9)

**114**వ అంశం : లియాన్ (శాప ప్రమాణం చేసిన) తరువాత భర్త చేసిన నిందారోపణ వీగిపోతుంది, భార్యకు విధించవలసిన శిక్ష కూడా రద్దవుతుంది

**115**వ అంశం : శాప ప్రమాణం షరీయత్ కోర్టు ముందరే జరగాలి.

**116**వ అంశం : శాప ప్రమాణానికి ముందు న్యాయమూర్తి ఆ దంపతులిద్దరికీ దైవభక్తి, దైవభీతి గురించి ఉపదేశించి నేరం చేసిన వారు నేరం ఒప్పుకోమని చెప్పాలి. ఇరువురిలో ఏ ఒక్కరు కూడా నేరాన్ని ఒప్పుకోకపోతేనే శాప ప్రమాణం (లియాన్) చేయించాలి.

teluguislam.net



## 117వ అంశం : సాక్ష్యాధారం లేకుండా న్యాయమూర్తి నేరస్థునికి శిక్ష విధించలేడు

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, తన భార్య షరీక్ బిన్ సహ్మాతో అక్రమ సంబంధం పెట్టుకుందని నిందవేశారు. దానికి దైవప్రవక్త(స), "సాక్షులను తీసుకురా. లేకుంటే నీ వీపుపై (కొరడా) దెబ్బలు పడతాయి" అని చెప్పారు. అప్పుడు హిలాల్ బిన్ ఉమయ్యా(రజి), 'ఓ దైవప్రవక్తా(స)! మాలో ఎవరి భార్య అయినా పరాయి మగవానితో కులుకుతుండగా కంటపడినప్పుడు అతను సాక్షుల్ని వెతుక్కోటానికి వెళ్ళిపోవాల్సిందేనా?' అని ప్రశ్నించారు. అయినప్పటికీ దైవప్రవక్త(స) రెండవసారి కూడా "సాక్షులను తీసుకురా. లేకుంటే నీ వీపుపై దెబ్బలు పడతాయి" అనే చెప్పారు. 'తమరిని సత్యసమేతంగా ప్రభవింపజేసిన వాని సాక్షిగా చెబుతున్నాను! నేను సత్యవంతుణ్ణి. అల్లాహ్ నా వీపుపై (కొరడా) దెబ్బలు పడకుండా తప్పనిసరిగా తన వచనాలను అవతరింపజేస్తాడ'ని హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) కరాకండీగా చెప్పారు. (అదే జరిగింది కూడా) హజ్రత్ జిబ్రయీల్ (అలైహి) దైవ వచనాలను తీసుకుని అవతరించారు. "ఎవరయినా తమ భార్యలపై నింద మోపి..." నుండి "ఒకవేళ అతను చెప్పేది నిజమే అయితే...."వరకు (నూర్:6-9). ఈ వచనాల అవతరణ తరువాత హజ్రత్ హిలాల్ (రజి) వచ్చి శాప ప్రమాణం చేశారు. దైవప్రవక్త(స) (ఆ దంపతులిద్దరినీ ఉద్దేశించి) ఇలా హితోపదేశం చేశారు: "మీరిరువురిలో ఎవరో ఒకరు అబద్ధం చెబుతున్నారన్న విషయం అల్లాహ్‌కు తెలుసు. కాబట్టి మీరిద్దరిలో ఎవరో ఒకరు (అబద్ధం చెబుతున్నవారు) పశ్చాత్తాపం చెందుతారా?" ఏ ఒక్కరూ పశ్చాత్తాపం ప్రకటించలేదు. పైగా ఆ స్త్రీ (శాపప్రమాణం) చేయటానికి లేచి నిలబడింది. (తన భర్త చెప్పేది అబద్ధమని) ఆమె నాలుగుసార్లు సాక్ష్యమిచ్చింది. ఐదవసారి కూడా సాక్ష్యమివ్వబోతూ ఉండగా, జనులు ఆమెను వారించారు. ఎందుకంటే ఐదవ సాక్ష్యం (దైవాగ్రహాన్ని) తప్పనిసరి చేస్తుందని వారు భావించారు (అందుకే బాగా ఆలోచించుకోవమ్మా! అని సూచించారు). హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) ఇలా అంటున్నారు: ఆ స్త్రీ ఆగిపోయింది. ఊగిసలాడసాగింది. ఆమె (తన తప్పును) అంగీకరిస్తుందని మేమనుకున్నాము. కాని ఆమె ఇలా అన్నది: 'నేను నా జాతి వారిని శాశ్వతంగా తలవంపుకు గురిచెయ్యదలచలేదు.' అంతే! ఆమె ఐదవసారి కూడా సాక్ష్యమిచ్చేసింది (అంటే ఈ మగవాడు తన నిందారోపణలో సత్యవంతుడే అయితే అల్లాహ్ ఆగ్రహం నాపై విరుచుకుపడుగాక! అని చెప్పింది). మహాప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఆమెను కనిపెడుతూ ఉండండి. ఆమెకు పుట్టే శిశువు బూడిద రంగు కన్నులు గలది, మందమైన వీపు గలది, లావుపాటి పిక్కలు గలది అయితే అది 'షరీక్' సంతానమై ఉంటుంది." జరిగింది కూడా అదే. (పిల్లవాడు పుట్టిన తరువాత) మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: 'ఒకవేళ దైవగ్రంథంలోని శాపప్రమాణ చట్టం లేకుండా ఉంటే నేను (ఆ స్త్రీపై) హద్దు విధించేవాణ్ణి." దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 118వ అంశం : శాప ప్రమాణం తరువాత పుట్టిన శిశువు తల్లికే ఇవ్వబడుతుంది.

---

*1. మిష్కాతుల్ మసాబీహ్ లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.3307*

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: "దైవప్రవక్త (స) ఒక పురుషుడు- ఒక స్త్రీ మధ్య లియాన్ (శాప ప్రమాణం) జరిపించారు. 'ఈవిడకు పుట్టబోయే బిడ్డ నా బిడ్డ కాదు' అని ఆ పురుషుడు చెప్పసాగాడు. అందువల్ల దైవప్రవక్త (స) వారిద్దరినీ వేరు పరచి, పుట్టబోయే శిశువును ఆ స్త్రీ వంశంతోనే ముడిపెట్టారు." దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 119వ అంశం : శాప ప్రమాణం ద్వారా విడిపోయే దంపతులు ఇక మీదట ఎట్టి పరిస్థితిలోనూ (పరస్పరం) వివాహం చేసుకోలేరు

హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) తెలిపారు: "(ఉవైమిర్ మరియు అతని భార్య శాపప్రమాణం చేసినప్పుడు) నేను దైవప్రవక్త(స) దగ్గరే ఉన్నాను. అప్పటి నుంచీ ఒండొకరి మీద ఆరోపించుకుని శాప ప్రమాణం చేసే భార్యాభర్తల విషయంలో ఒక సంప్రదాయం నెలకొన్నది- అదేమిటంటే ఇక మీదట వారెన్నడూ నికాహ్ చేసుకోలేరు."

(అబూదావూద్ 2250 సహీహ్).[2]

## 120వ అంశం : శాప ప్రమాణం తరువాత తల్లికి అప్పగించబడిన బిడ్డ తల్లికి వారసుడవుతాడు. అతని వారసత్వ సొమ్ముకు తల్లి వారసురాలవుతుంది.

## 121వ అంశం : శాప ప్రమాణం తరువాత ఆ పురుషుణ్ణి గానీ, స్త్రీనిగానీ వ్యభిచారి(ణి) అని నిందించిన వారు శిక్షార్హులవుతారు.

## 122వ అంశం : శాప ప్రమాణం తరువాత ఆ పురుషునికి గానీ, స్త్రీకి గానీ కలిగిన సంతానాన్ని 'అక్రమ సంతానం' అని నిందించేవారు కూడా శిక్షార్హులే.

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి, ఆయనేమో తన తాత గారి (ర.అన్‌హుమ్) నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (స) శాప ప్రమాణం చేసినవారి గురించి ఏమని నిర్ణయించారంటే; "తల్లి బిడ్డకు, బిడ్డ తల్లికి వారసులవుతారు. ఒకవేళ ఎవరయినా ఆ స్త్రీని 'వ్యభిచారిణి' అనంటే వారికి ఎనభై కొరడా దెబ్బలు వేయబడతాయి. ఒకవేళ ఆ బిడ్డను ఎవరయినా 'అక్రమ సంతానం' అని చెబితే వారికి కూడా ఎనభై కొరడా దెబ్బలు పడతాయి." దీనిని అహ్మద్ పొందుపరిచారు.[3]

## 123వ అంశం : దంపతుల మధ్య 'శాప ప్రమాణం' జరగనంత వరకూ శిశువు తండ్రిదిగానే పరిగణించబడుతుంది

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "భార్యగల వాడికే పిల్లవాడు చెందుతాడు. వ్యభిచారికి శిలా శిక్షే."

(నసాయి 3482. సహీహ్, అబూదావూద్ 2273, బుఖారీ 6750, ముస్లిం 1458).[4]

---

*1. కితాబుత్తలాఖ్ - బాబు యల్ హఖుల్ వలదు బిల్ మలాయనతు*

*2. సహీహ్ సుననె అబీ దావూద్ లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.1969*

*3. నైలుల్ అవ్‌తార్- కితాబుల్లియాన్, బాబు మాజాఅ ఫీఖజఫుల్ మలాఅన*

*1. సహీహ్ సుననె నసాయి లిల్ అల్‌బానీ-రెండవ భాగం, హ.నెం.3258*